క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్స్, ద శ్రీరామ స్కూల్, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్‌హిల్స్, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు టెలికాంనగర్, ఆర్‌టీటీసీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్ అండ్ టీ టవర్స్, టెలికాం నగర్ స్ట్రీట్ నెంబర్ 22,23,24 తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



మియాపూర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో 20 పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలను నిర్వహించారు. చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

'మనూ' దూరవిద్యలో డ్రాపౌట్లకు మళ్లీ అవకాశం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా విభాగంలో డ్రాపౌట్లకు మళ్ళీ ప్రవేశం కల్పించాలని నిర్ణయించినట్లు మనూ డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. డీడీఈ ఆధ్వర్యంలో రీఅడ్మిషన్లను 2005 ఆ తరువాత బ్యాచ్‌లు, అంతేకాకుండా యూజీ, 2014 నుంచి వార్షిక మోడ్‌లో పీజీ ఫాలో-ఆన్-కోర్సులలో నమోదు కోసం ఫీజు చెల్లింపు పోర్టల్‌ను చూడవచ్చన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న ఉపకమిషనర్ సుధాంశ్

మియాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమీనగర్ కాలనీలో చందానగర్ సర్కిల్-21 ఉపకమిషనర్ సుధాంశ్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కాలనీ వాసులు కాలనీలో సమస్యలను అతని దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీలోని మున్సిపల్ పార్క్‌ను అభివృద్ధికి సహకరించాలని అదేవిధంగా ట్రాఫిక్ సమస్యకు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా కాలనీలో పెండింగ్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న స్థానికులు

రాయదుర్గం: ప్రతీకాలనీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో ఆయన స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మెదక్ జిల్లా రేగోడ్ మండలం, గజ్వాడ గ్రామానికి చెందిన సంగమేశ్(38) బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం పటాన్‌చెరు వచ్చాడు. గొల్లబస్తీలో నివాసం ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. 20 రోజుల క్రితం భార్య పద్మ, సంగమేశ్ గొడవపడ్డారు. దీంతో భార్యా పుట్టిల్లయిన మెదక్ మల్లంపేటకు వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన సంగమేశ్ మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు రోడ్డుపాలు

పైప్‌లైన్లకు తరచూ లీకేజీలు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- సరఫరా అవుతున్న కలుషిత జలాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



కమలప్రసన్ననగర్‌లో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి రోడ్లపై పారుతున్న తాగునీరు

అల్విన్‌కాలనీ: అసలే వైరస్‌లు వ్యాప్తి చెంది అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. అది ఏ రోగమో కూడా తెలియక సతమతమవుతున్న కాలంలో కలుషిత జలాల సరఫరాతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్‌లోని ప్రతి కాలనీలో తాగునీటి పైపులైన్లు లీకై తాగునీరు రోడ్డు పాలవుతోంది. ఈ నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా గోదావరి జలాలు నగరవాసులకు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీటి వృథాతో పాటు కలుషిత జలాల సరఫరా అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కాలనీలో పర్యటించి లీకేజీల మరమ్మతులతో పాటు పకడ్బంది చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- వివేకానందనగర్ డివిజన్ కమలప్రసన్ననగర్ కాలనీ ప్రధాన రహదారి పైపులైన్ రోడ్డులో ఉన్న మెయిన్ వాటర్ పైపులైన్ కొన్ని నెలలుగా లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. ఇదే పైపు లైన్ ద్వారా కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని అన్ని కాలనీలకు తాగునీరు సరఫరా అవుతోంది. ప్రధాన రహదారి కావటంతో రహదారిపై ప్రవహించే నీటిలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఆ నీరు ఇతరులపై పడటంతో చిన్నపాటి గొడవలు కూడా జరుగుతున్నాయి.
- అల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జిపై ఉన్న ప్రధాన పైపులైన్ లీకేజీ కారణంగా బ్రిడ్జిపై ఉన్న మురుగు, చెత్తాచెదారం పైపులైన్‌పై చేరి ఈగలు, దోమలకు ఆవాసంగా మారి మంచినీటి పైపులైన్‌ల ద్వారా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. కొన్ని నెలలుగా ఈ పైపులైన్ లీకేజీ అవుతున్నా స్థానికంగా మురుగు ప్రవహిస్తున్నా అక్కడే చెత్తాచెదారం పడేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



రిక్షాపుల్లర్స్ కాలనీలో..



అల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డుపై...

- పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయాలని అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు తెలుపుతున్నారు. నిత్యం ఇదే రహదారిపై ప్రయాణించే వారు ఈ కలుషిత నీరే మనం తాగుతున్నామా అని బెంబేలెత్తుతున్నారు.
- రిక్షాపుల్లర్స్ కాలనీలో నల్లాలు విప్పిన ప్రతిరోజు తాగునీరు వృథాగా వదిలేస్తున్నారు. ఎక్కువగా నిరుపేదలే ఈ కాలనీలో నివసిస్తుంటారు. కనీస అవగాహన లేక నీరు సరిపోయిన తరువాత నల్లాలు కట్టేయాల్సింది పోయి నీటిని రోడ్లపైనే వృథాగా వదిలివేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ కాలనీలో పర్యటించి నీటి విలువపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి పైపులైన్లు లీకేజీలపై పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలి



అల్విన్‌కాలనీ ప్రధాన రహదారిలో పైపులైన్లు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు ఏదో ఒక ప్రాంతంలో లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. ఈ నీరు తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిదులు పర్యవేక్షించి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలి. ప్రజలకు స్వచ్ఛమైన శుచి, శుభ్రతతో కూడిన తాగునీరు సరఫరా చేయాలి.

– నరేందర్‌రెడ్డి, అల్విన్‌కాలనీ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన సుధాకర్ రెండు లక్షల రూపాయాల చెక్కును అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందించారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

సోషల్‌మీడియాలో ప్రతి ఒక్కరూ యాక్టివ్



సింపోజియంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారని అనురాగ్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సైదా సమీన్‌ఫాతిమా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'లింగ సమానత్వం అండ్ డిజిటల్ స్పేస్‌లలో మహిళల రక్షణ' అనే అంశంపై ప్రత్యేక సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ సిస్టమ్‌లో లోపాలు ఉన్నాయని, ఫలితంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. అన్ని రంగాలలో మహిళలకు న్యాయం సమాన వేతనాలు, సమాన అవకాశాలు ఉన్నాయన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

చిట్కుల్‌లో ఫ్లెక్సీల వివాదం



మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్‌లో ఫ్లెక్సీల వివాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను పటాన్ చెరు జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించటంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో మధు అభిమానులు కార్యకర్తలు జీహెచ్ఎంసీ కార్యాలయానికి చేరుకొని కమిషనర్‌ను నిలదీశారు. కార్యకర్తలు, అభిమానులు పెట్టిన ఫ్లెక్సీలను తమ పరిధిలో కాని, ముత్తంగి పంచాయతీ పరిధిలోని ఫ్లెక్సీలను తొలగించటం ఎంత వరకు సమంజసమన్నారు. అన్యాయాన్ని అడ్డుకుంటే అరెస్టు చేస్తారా అని నీలం మధు ముదిరాజ్ ఈ సందర్భంగా తీవ్ర ఉద్విగ్నంగా మాట్లాడారు. చిటుకుల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నీలం మధు మాట్లాడారు... డబ్బుతో అన్నింటినీ సాధించలేరని డబ్బుంటే ఇంట్లోనూ బ్యాంకులోనూ దాచుకోవచ్చని ప్రజల అభిమానాన్ని చూడగొనలేరన్నారు. గతంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ, అయ్యప్ప, పడిపూజ, శివోత్సవం తదితర కార్యక్రమాలలో పెట్టిన ఫ్లెక్సీలను చింపేశారని అయినా తమ కార్యకర్తలు సహనంగా ఉంటున్నారన్నారు.

ముస్లిం శ్మశానవాటిక పనులు త్వరలో పూర్తి చేస్తాం



బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

అల్విన్‌కాలనీ: కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి శ్మశానవాటికల అభివృద్ధి పనులు చేపడుతున్నామని అల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ముస్లిం శ్మశానవాటికలో కమిటీ ఆధ్వర్యంలో వేస్తున్న బోర్‌వెల్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్లమ్మబండలో ముస్లిం, హిందూ, క్రిస్టియన్ శ్మశానవాటిక పనులను కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ముస్లిం శ్మశానవాటిక పనులను కోటి రూపాయల నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. త్వరలో నిధులు మంజూరు చేయించి శ్మశానవాటికలో మిగిలిన పెండింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. శ్మశానవాటికకు ప్రహరీతో పాటు ఉద్యానవనంలా శ్మశానవాటికలో మొక్కలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్మశానవాటిక కమిటీ సలహాదారుడు ఎండీ ఇస్మాయిల్, షబ్బీర్, ఖాజా, ఎంఏ కరీం, అధ్యక్షుడు ఎంఏ సమ్మద్, ప్రధాన కార్యదర్శి షౌకత్ అలీ మున్నా తదితరులు పాల్గొన్నారు.

విడాకులివ్వకుండా మరో పెళ్లి.. వ్యక్తికి జైలు శిక్ష

మియాపూర్: మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా మరో పెళ్లి చేసుకున్న ఓవ్యక్తికి కూకట్‌పల్లి కోర్టు ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన మేరకు.. పంజాగుట్టకు చెందిన జి. ప్రవీణ్‌కుమార్, మియాపూర్‌కు చెందిన సంతోష్ వాణిని మొదట పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత వాణికి తెలియకుండా, విడాకులు ఇవ్వకుండా కొత్తగూడకు చెందిన భవానీ అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సంతోష్ వాణి 2016లో ప్రవీణ్‌కుమార్‌పై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. పోలీసులు చార్జీషీటు కోర్టులో సమర్పించారు. వాదోపవాదాలు విన్న తర్వాత కూకట్‌పల్లి 8వ అదనపు మెట్రో పాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి. భవానీ ప్రవీణ్‌కుమార్‌కు ఓ సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానాను విధించినట్లు తెలిపారు.

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ తెలిపారు. బుధవారం జిన్నారంలో ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో కమిటీలను వేశామన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు.

వేగంగా దేవాలయ నిర్మాణ పనులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని నల్లపోచమ్మ దేవాలయ పునర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. బుధవారం మాజీఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లింగం తదితరులు పనులను పరిశీలించారు. దేవాలయ నిర్మాణానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో పాటు దాతలకు శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు చెప్పారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గుమ్మడిదల జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ అన్నారు. గుమ్మడిదలలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ఉపయోగపడే పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేపర్ లీక్ ప్రభుత్వ నిర్వాకమే

మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ప్రభుత్వ నిర్వాకమేనని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నేత అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బొల్లారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలను రాసేందుకు లక్షల సంఖ్యలో నిరుద్యోగులు సిద్ధమవుతుంటే పేపర్ లీక్ బాధాకరమన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు.

కేంద్రీయ ఉపకార వేతనాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక



బిందు | జాహ్నవి దుర్గ | శివ | నవ్య శ్రీ | నతానేల్ జేదిద్య

గచ్చిబౌలి: కేంద్రీయ ఉపకార వేతనాల(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు అనంత రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 2022 డిసెంబర్ 18న ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఈ ప్రవేశ పరీక్షలో కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు దిండి బిందు, వాసంశెట్టి జాహ్నవి దుర్గ , గుమ్మడవెల్లి శివ, ఎల్.కె.నవ్య శ్రీ, నాగేటి నతానేల్ జేదిద్య, ముంగ్యా అఖిల ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు నెలకు వెయ్యి రూపాయల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఆరు నెలల పాటు పక్కా ప్రణాళిక ప్రకారం శ్రమించి ప్రవేశ పరీక్ష రాశారని, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

నియంతృత్వ పాలనను అంతం చేయడమే బీజేపీ లక్ష్యం



పార్టీలో చేరిన వారితో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ, రాచరికపు పాలనను అంతం చేయడమే బీజేపీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మసీదుబండలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ.. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళడానికి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. ఈ సారి ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలోనేకాకుండా శేరిలింగంపల్లిలో కాషాయజెండా ఎగురవేయడం ఖాయమన్నారు.

వీడని బాలుడి కిడ్నాప్ మిస్టరీ

మియాపూర్ : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కిడ్నాప్ అయిన బాలుడి మిస్టరీ 24 గంటలు పైగా గడుస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం గంగమ్మ అలియాస్ అనిత అనే మహిళ స్నేహితురాలు వాణితో కలిసి మద్యంతాగి నిద్రిస్తున్న సమయంలో గంగమ్మ కుమారుడు సాయిని స్నేహితురాలు వాణి ఎత్తుకెళ్లిన సంఘటన విదితమే. మియాపూర్ లోని మంజీరా రోడ్డు సమీపంలో వైశాలినగర్ వద్ద చెట్టుకింద 11 గంటల సమయంలో గంగమ్మ, స్నేహితురాలు వాణిలు చెత్త ఎరుకుని వచ్చి కల్లుతాగి నిద్రించారు. గంగమ్మకు కొద్దిసేపటి తర్వాతకు మెలుకువకు వచ్చిచూడగా స్నేహితురాలు వాణి, గంగమ్మ కుమారుడు సాయి (1) కనపించలేదు. దీంతో గంగమ్మ భర్త మల్లేష్‌తో కలిసి మంగళవారం మధ్యాహ్నం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలుడు అదృశ్యమయ్యాడని పిర్యాదు చేసి 24 గంటలు గడుస్తున్నా బాలుడి ఆచూకీ తెలియలేదు. తమ కుమారుడు ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి మల్లేష్, తల్లి గంగమ్మలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మియాపూర్ పోలీస్‌లు సీసీ కెమెరాల ఆధారంగా బాలుడి ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం మియాపూర్ అల్విన్ క్రాస్ రోడ్డు వరకు వాణి తమ ఇద్దరు పిల్లలు, సాయిని తీసుకుని నడుచుకుంటూ పోతుండగాసీసీ కెమెరాల్లో గుర్తించారు. అక్కడ బస్సెక్కి ఎటాన్‌చెరులో దిగినట్లు సమాచారం. మియాపూర్ ఎస్ఐ అహ్మద్‌పాషా ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

కానుకుంటలో బస్తీ దర్శన్



మాట్లాడుతున్న కార్పొరేటర్ నగేశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కానుకుంటలో బుధవారం బస్తీ దర్శన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బస్తీ వాసులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. బస్తీ దర్శన్‌లో సమస్యలు తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఆమె వివరించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బూరుగడ్డ నగేశ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



పట్టా సర్టిఫికెట్లను అందుకున్న రైతులతో ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని వాటిని పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. క్వారీ అనుమతులు లేకున్నా నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన జిన్నారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలను సభకు వివరించారు. జిన్నారం మండలానికి రూ.2.75కోట్ల డీఎస్ఎఫ్ నిధులు మంజూరైనట్లు ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. గడ్డపోతారంలో పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయని ఎంపీటీసీ సభ్యురాలు జానాబాయి అధికారులకు వివరించారు. ఖాజీపల్లిలో అనుమతులు లేకుండా క్వారీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, పనులు చేయొద్దని గ్రామ పంచాయతీ తీర్మానం చేసినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యుడు భార్గవ్ చెప్పారు. ఊట్ల గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు కాంట్రాక్టర్ రూ.లక్ష లంచం అడుగుతున్నారని వైస్ ఎంపీపీ గంగు రమేశ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సభ్యులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్ పాల్గొన్నారు.

రైతులకు పట్టాలు అందజేత

జిన్నారంలోని ఒకటి సర్వేనంబర్‌లో గల భూములను రైతులు హెచ్ఎండీఏకు అప్పజెప్పినందుకు 38మంది రైతులకు 600గజాల చొప్పున పట్టా సర్టిఫికేట్లను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అందజేశారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీలు వెంకటేశంగౌడ్, లావణ్య పాల్గొన్నారు.